[2010] 2 ఎస్.సి.ఆర్. 1047

అంగద్ దాస్

వర్సెస్

భారత యూనియన్ & ఇతరులు

(సివిల్ అప్పీల్ నెంబర్లు 1429-1430/2008)

ఫిబ్రవరి 18, 2010

[దల్వీర్ భండారీ మరియు ఏ.కె. పట్నాయక్, న్యాయమూర్తులు]

*సేవ చట్టము:*

*సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ రూల్స్, 1955 – రూల్ 28 – ఉద్యోగంలో చేరిన సమయంలో నిజమైన పుట్టిన తేదీని దాచిపెట్టినందుకు నేరస్థుడైన అధికారికి 'తప్పనిసరి పదవీ విరమణ' శిక్ష – అతని పునర్నియామకాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నేరస్థుడైన అధికారి లేఖ ద్వారా ఉన్నతాధికారులను అభ్యర్థించాడు - లేఖను అప్పీలుగా పరిగణించి, శిక్షను 'ఉద్యోగం నుండి తొలగింపు' నకు పెంచారు - సమీక్షను సంబంధిత అథారిటీ కొట్టివేసింది - రిట్ పిటిషన్ ను కొట్టివేయడం – నిర్ణయం: అప్పీలుపై, తిరిగి ఉపాధిని అభ్యర్థించే లేఖను రూల్ 28 కింద అప్పీలుగా పరిగణించలేము – శిక్షను పెంచడం అనేది అన్యాయమైనది - పెన్షన్ ప్రయోజనాలను వడ్డీతో చెల్లించాలని ఆదేశం.*

అప్పీలుదారు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లో కానిస్టేబుల్ గా నియమించబడ్డాడు, ఉద్యోగంలో చేరిన సమయంలో ఇచ్చిన తన పుట్టిన తేదీ అబద్ధమని ఆరోపిస్తూ దాదాపు 25 సంవత్సరాల సర్వీస్ తర్వాత షోకాజ్ నోటీసు జారీ చేయబడింది. విచారణ తరువాత, అతనికి తప్పనిసరి పదవీ విరమణ శిక్షగా విధించబడింది. అప్పీలుదారు, ఆ తరువాత, తనకు అపారమైన కుటుంబ బాధ్యత ఉన్నందున తనను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని ప్రార్థిస్తూ సిఆర్పిఎఫ్ డిఐజి పోలీసుకు లేఖ రాశారు. ఈ లేఖను అప్పీల్ గా పరిగణించి, సిఆర్పిఎఫ్ డిఐజి పోలీసు అతని శిక్షను 'ఉద్యోగం నుండి తొలగింపు' కు పెంచారు. దీనికి వ్యతిరేకంగా దాఖలు చేసిన రివిజన్ పిటిషన్ ను కాంపిటెంట్ అథారిటీ కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను కొట్టివేసింది. అందుకే ప్రస్తుత అప్పీళ్లు దాఖలు చేయబడ్డాయి.

అప్పీళ్లను అనుమతిస్తూ, ఈ కోర్టు

నిర్ణయం: 1. పురార్నియామకం కోసం అభ్యర్థించిన లేఖను సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ రూల్స్, 1955 లోని రూల్ 28 కింద అప్పీల్ గా పరిగణించలేము. సిఆర్‌పిఎఫ్ డిఐజి పోలీసు శిక్షను 'తప్పనిసరి పదవీ విరమణ' నుండి 'ఉద్యోగం నుండి తొలగింపు' కి పెంచడంలో అన్యాయంగా వ్యవహరించారు. ఈ ఉత్తర్వు చట్టబద్ధంగా ఆమోదయోగ్యం కాదు. సిఆర్‌పిఎఫ్ డిఐజి పోలీసు జారీ చేసిన ఉత్తర్వులను సమర్థించి, సమీక్షించే అథారిటీ కూడా తీవ్రంగా తప్పు చేసింది. ఏకపక్ష ఆదేశాల కారణంగా అప్పీలుదారుడు మరియు అతని కుటుంబం విపరీతమైన మానసిక వేదనను ఎదుర్కొన్నారు మరియు వారికి వేధింపులు కూడా జరిగాయి. అప్పీలుదారుకు చెల్లించాల్సిన మరియు అతనికి రావాల్సిన అన్ని పెన్షనరీ ప్రయోజనాలను, "సంవత్సరానికి 9% వడ్డీ రేటుతో, ఈ ఉత్తర్వు అందిన తేదీ నుండి రెండు నెలల లోపల చెల్లించాలి. [పేరా 8, 10 మరియు 11] [1051–C–E, G–H; 1052–A].

2. అథారిటీ మరియు అధికారంలో ఉన్న వ్యక్తులు తేలికగా సమస్థితి, మనోధైర్యం మరియు సాధారణ ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం కోల్పోకూడదు. అధికారం మరియు అథారిటీ చట్టాలు మరియు మానవ కనికరం ప్రకారం న్యాయబద్ధంగా ఉపయోగించబడాలని వారు ఎల్లప్పుడూ కోరుకుంటారు. వారి అధికారిక విధులు మరియు పనులను నిర్వర్తించడంలో అహంకారానికి స్థానం ఉండకూడదు. భవిష్యత్తులో సీనియర్ అధికారులు వినయపూర్వకమైన మరియు నిరాడంబరమైన ఉద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరించి ఇలాంటి ఉత్తర్వులను జారీ చేయరని కోర్టు ఆశిస్తోంది మరియు విశ్వసిస్తోంది. [పేరాలు 1 మరియు 13] [1049–B–C; 1052–B].

సివిల్ అప్పిల్లేట్ అధికార పరిధి: సివిల్ అప్పీల్ నెం.1429–1430/2010.

సివిల్ రిట్ పిటిషన్ నెం.5006/1998 లో న్యూఢిల్లీలోని ఢిల్లీ హైకోర్ట్ 12.5.2008 & 4.8.2008 తేదీలల్లో వెలువరించిన తీర్పు మరియు ఉత్తర్వు నుండి.

అప్పీలుదారు తరఫున దలీప్ కుమార్ మల్హోత్రా, రాజేష్ మల్హోత్రా.

ప్రతివాది తరఫున వివేక్ తన్ఖా, ASG, సత్య సిద్దిఖీ, ఎ. దేబ్ కుమార్, శ్రీకాంత్ ఎన్ టెర్దాల్ ఉన్నారు.

ఈ కోర్టు యొక్క తీర్పు వెలువరించినవారు

**దల్వీర్ భండారీ, న్యాయమూర్తి.** 1. అథారిటీ మరియు అధికారంలో ఉన్న వ్యక్తులు తక్కువ మనుషుల సమస్యల పట్ల సమానత్వం, ప్రశాంతత మరియు ప్రశంసలను సులభంగా కోల్పోకూడదు. అధికారం మరియు అథారిటీ చట్టాలు మరియు మానవ కనికరం ప్రకారం న్యాయబద్ధంగా

ఉపయోగించబడాలని వారు ఎల్లప్పుడూ కోరుకుంటారు. వారి అధికారిక విధులు మరియు పనులను నిర్వర్తించడంలో అహంకారానికి స్థానం ఉండకూడదు.

2. ఆలస్యం క్షమించబడింది. అనుమతి మంజూరు చేయబడింది.

3. గౌరవ అదనపు సొలిసిటర్ జనరల్ మరియు అప్పీలుదారు తరపున గౌరవ న్యాయవాది వాదనలను సుదీర్ఘంగా విన్నాము. ఈ అప్పీళ్లను పరిష్కరించడానికి అవసరమైన సంక్షిప్త వాస్తవాలు ఈ క్రింది విధంగా పునరావృతం చేయబడ్డాయి:–

4. అప్పీలుదారుడు 1969 లో యు.పి. రాష్ట్రంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, బాలియా పోలీస్ లైన్ లో కానిస్టేబుల్ గా నియమించబడ్డారు. అతను లాన్స్ నాయక్ పదవికి, తరువాత నాయక్ గా, ఆ తరువాత హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందాడు. అప్పీలుదారుడు జమ్మూ కాశ్మీర్లో హెడ్ కానిస్టేబుల్ గా నియమించబడినప్పుడు, అతను ఉద్యోగంలో చేరిన సమయంలో ఇచ్చిన పుట్టిన తేదీ అబద్ధమని ఆరోపిస్తూ కమాండెంట్ 51 బిఎన్, సిఆర్పిఎఫ్ (ప్రతివాది సంఖ్య 4) చేత 11.4.1995 నాడు షోకాజ్ నోటీసు ఇచ్చారు. విచారణ నిర్వహించబడింది మరియు ఆ తర్వాత అప్పీలుదారు ప్రతివాది నెం.4 చేత జారీ చేసిన 14 జూన్, 1996 నాటి ఉత్తర్వు ద్వారా శిక్షార్హత వలన ఉద్యోగం నుండి నిర్బంధంగా పదవీ విరమణ చేశారు. ఆ ఉత్తర్వులో ఈ క్రింది విధంగా ఉంది:–

> "జాగ్రత్తగా ఆలోచించిన తరువాత మరియు అతని సుదీర్ఘ కెరీర్ ను దృష్టిలో ఉంచుకుని, ఒక కుటుంబానికి మద్దతు ఇవ్వడానికి మరియు సహజ న్యాయాన్ని పరిగణిస్తూ, నేను సిఆర్పిఎఫ్ చట్టం, 1949 లోని సెక్షన్ 11 (1) క్రింద పట్టికతో చదివిన సిఆర్పిఎఫ్ రూల్ 1955 లోని రూల్ 27 ప్రకారం నాకు ఉన్న అధికారం ద్వారా No.690298321 HC అంగద్ దాస్ పై 31.05.96 మధ్యాహ్నం నుండి ఉనికిలోకి వచ్చే 'కృతజ్ఞత మరియు పూర్తి పెన్షనరీ ప్రయోజనాలతో కూడిన ఉద్యోగం నుండి తప్పనిసరి పదవీ విరమణ' ను శిక్షగా విధిస్తున్నాను".

5. అప్పీలుదారుడు అదనపు జిల్లా ఇన్స్పెక్టర్ జనరల్, పోలీసు(సంక్షిప్తంగా, డిఐజి)కి, తిరిగి ఉద్యోగం కోసం తన అభ్యర్థనను దయతో పరిగణనలోకి తీసుకోవాలని ప్రార్థిస్తూ, ఎందుకంటే తన ఐదుగురు కుమార్తెలను చదివించి మరియు వారికి వివాహం చేయాలి అనే అపారమైన బాధ్యత ఉంది అని చాలా మర్యాదపూర్వకమైన అభ్యర్థన లేఖను పంపారు. చేతులు జోడించి ఆయన పాదాలను తాకుతూ ప్రార్థన చేశారు. ఆ లేఖ వినయం యొక్క పరాకాష్టను ప్రతిబింబించింది. అభ్యర్థన లేఖలోని సంబంధిత భాగం ఈ క్రింది విధంగా ఉందిః

"ఐదుగురు కుమార్తెల విద్య, వివాహాల భాధ్యతలతో నేను ఉన్నాను మరియు నేను మాత్రమే సంపాదించేవాడిని మరియు గ్రామ పంచాయతీ యొక్క వంశపారంపర్య రికార్డు ప్రకారం నా పుట్టిన తేదీ 8.7.47. బీడిఓ ఆదేశాల మేరకు నాకు ఆ రికార్డు అందింది. నాకు గ్రామ ప్రధాన్ నుండి సర్టిఫికేట్ కూడా ఉంది. అందువల్ల, నేను చేతులు జోడించి, పాదాలను తాకుతూ, ఉద్యోగాన్ని పూర్తి చేయడానికి నన్ను అనుమతించాలని మరియు నాకు మరే ఇతర శిక్ష అయిన విధించవచ్చు అని ప్రార్థిస్తున్నాను, లేకపోతే, ఏడుగురు వ్యక్తులు వేరుచేయబడి మరియు బిక్షాటనను ఆశ్రయిస్తారు మరియు వారి ఆహారం సంపాదించడానికి తప్పు మార్గంలో పడిపోతారు".

6. పునర్నియామకం కోసం అప్పీలుదారు అభ్యర్థనను అంగీకరించడం లేదా తిరస్కరించడం చేస్తే ప్రతివాది నెం.4 పూర్తిగా సమర్థించబడి ఉండేవాడు, కానీ ఆశ్చర్యకరంగా, అక్టోబర్ 8, 1996 న, పునర్నియామకం కోసం అప్పీలుదారు యొక్క అభ్యర్థన లేఖను డిఐజి పోలీస్, సిఆర్‌పిఎఫ్, అవడి, మద్రాసు అప్పీల్ గా పరిగణించారు మరియు కమాండెంట్, 51 బిఎన్, సిఆర్పిఎఫ్ విధించిన "తప్పనిసరి పదవీ విరమణ" శిక్షను, 31.5.1996 నుండి ఉనికిలోకి వచ్చే "ఉద్యోగం నుండి తొలగింపు" కి పెంచారు. ఉద్యోగంలో పునర్నియామకం కోసం చేసిన అభ్యర్థన లేఖను అప్పీల్ గా పరిగణించడానికి చట్టంలోని ఏ నిబంధన అతన్ని అనుమతించదు. అప్పీలుదారుడి శిక్షను పెంచే శక్తి లేదా అధికారం డిఐజి (పోలీసు)కు లేదు. దయతో తిరిగి ఉపాధిని కోరుతూ ఇటువంటి హానిరహితమైన, మర్యాదపూర్వకమైన అభ్యర్థన లేఖకు ఇంత అనవసరమైన, అహంకారపూరిత ప్రతిస్పందన ఎలా లభించిందో మేము అర్థం చేసుకోలేపోతున్నాము. ఈ ఉత్తర్వు పూర్తిగా ఏకపక్షంగా మరియు చట్టవిరుద్ధంగా ఉంది.

7. ఈ ఉత్తర్వుతో బాధపడిన అప్పీలుదారుడు, ప్రత్యేక డైరెక్టర్ జనరల్, సిఆర్‌పిఎఫ్, హైదరాబాద్ ముందు రివిజన్ పిటిషన్ ను దాఖలు చేశారు, కానీ వారు దురదృష్టవశాత్తు ఈ క్రింది ఉత్తర్వును ఆగస్టు 2,1997 న ఆమోదించారు.

"51 బిఎన్ సిఆర్‌పిఎఫ్ కు చెందిన HC అంగద్ దాస్ ఈ ఉత్తర్వు జారీ చేసిన తేదీ నుండి ఉద్యోగం నుండి తొలగించబడ్డారు. 31.5.96 (AN) నుండి ఈ ఆర్డర్ తేదీ వరకు గల మధ్య మధ్యంతర కాలాన్ని అన్ని ప్రయోజనాల కోసం 'డైస్ నాన్' గా పరిగణించబడుతుంది."

8. ఉద్యోగంలో పునర్నియామకం కోసం చేసిన సాధారణ అభ్యర్థన లేఖ డిఐజి పోలీసు, సిఆర్‌పిఎఫ్ చేత అప్పీల్ గా ఎలా పరిగణించబడిందో అని మేము ఆశ్చర్యపోతున్నాము మరియు సిఆర్‌పిఎఫ్ రూల్స్, 1955 యొక్క రూల్ 28 కింద తన అధికారాన్ని వినియోగించుకుంటూ, ఉద్యోగం నుండి "తప్పనిసరి పదవీ విరమణ" శిక్షను 31.5.1996 నుండి "ఉద్యోగం నుండి

తొలగించడం" కు పెంచారు. ఉద్యోగంలో పునర్నియామకం కోసం రాసిన లేఖను సిఆర్పిఎఫ్ రూల్స్, 1955లోని రూల్ 28 ప్రకారం అప్పీల్ గా పరిగణించకూడదు. డిఐజి పోలీసు, సిఆర్‌పిఎఫ్, శిక్షను "తప్పనిసరి పదవీ విరమణ" నుండి "ఉద్యోగం నుండి తొలగింపు" కి పెంచడంలో పూర్తిగా అన్యాయంగా వ్యవహరించారు. ఈ ఉత్తర్వు చట్టబద్ధంగా ఆమోదయోగ్యం కాదు. డిఐజి పోలీసు, సిఆర్‌పిఎఫ్ ఆమోదించిన అక్టోబర్ 8, 1996 నాటి ఉత్తర్వులను సమర్థించి స్పెషల్ డైరెక్టర్ జనరల్ కూడా తీవ్రంగా తప్పు చేశారు.

9. ఈ కేసు యొక్క విచిత్రమైన వాస్తవాలు మరియు పరిస్థితులలో, మేము అక్టోబర్ 8, 1996 మరియు ఆగస్టు 2, 1997 నాటి ఉత్తర్వులను పక్కన పెట్టడం జరిగింది. ఫలితంగా, కమాండెంట్, 51 బిఎన్, సిఆర్‌పిఎఫ్ జారీ చేసిన 21.5.1996 నాటి ఉత్తర్వు, సవరించబడిన 14.6.1996 నాటి “తప్పనిసరి పదవీ విరమణ” ఉత్తర్వు ద్వారా పునరుద్ధరించబడింది. ఈ ఉత్తర్వు ద్వారా వచ్చే అన్ని ప్రయోజనాలకు అప్పీలుదారుకు అర్హత ఉంటుంది.

10. పైన పేర్కొన్న పూర్తి ఏకపక్ష ఉత్తర్వుల కారణంగా అప్పీలుదారు మరియు అతని కుటుంబం విపరీతమైన మానసిక వేదన మరియు వేధింపులకు గురయ్యారు.

11. ఈ ఉత్తర్వు అందిన తేదీ నుండి రెండు నెలల్లోపు, అప్పీలుదారుకు సంవత్సరానికి 9% వడ్డీ రేటుతో, అతనికి రావలిసిన మరియు చెల్లించవలసిన అన్ని పెన్షనరీ ప్రయోజనాలను చెల్లించాలని కూడా మేము ఆదేశిస్తున్నాము.

12. తదనుగుణంగా, ఈ అప్పీళ్ళు అనుమతించబడ్డాయి. ప్రతివాది నెం.1 అయిన భారత యూనియన్ రెండు నెలల్లోపు అప్పీలుదారుకు రూ.50,000/- ఖర్చులను చెల్లించాలని ఆదేశించించడం జరిగింది.

13. భవిష్యత్తులో సీనియర్ అధికారులు వినయపూర్వకమైన మరియు నిరాడంబరమైన ఉద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరించి ఇలాంటి ఉత్తర్వులను జారీ చేయరని మేము ఆశిస్తున్నాము మరియు విశ్వసిస్తున్నాము.

అప్పీళ్ళు అనుమతించబడ్డాయి.

అనువాదకుడు: CSR

అనువదించిన ఆంగ్ల పేజీల సంఖ్య: 6.